క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం

రొంపిచర్ల: మండలంలోని మాచవరం పంచాయతీ కార్యాలయంలో బుధవారం డాక్టర్ ఎం.వీ. రెడ్డి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 137 మంది కంటి రోగులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 16 మందికి కంటి శుక్లాలు, ఐదుగురికి కంటి పొరలు ఉన్నట్లు నిర్ధారించారు. వ్యాధి నిర్ధారణ అనంతరం అవసరమైన మందులను, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. డీవోఏ సుమంత్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మాచవరం, నల్లగార్లపాడు, దాసరిపాలెం గ్రామాలకు చెందిన రోగులు హాజరయ్యారు. శిబిరాన్ని గాయం గోవిందరెడ్డి పర్యవేక్షణలో ఎం.వీ. రెడ్డి ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి వర్ధంతి



వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుడివాడ చిన్న గురునాథం, మోటమర్రి నరసింహారావు ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నరసరావుపేట రోడ్డులోని కొణిజేటి రోశయ్య విగ్రహానికి ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘ కాలంగా ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసి ఆ పదవికే వన్నె తెచ్చిన నాయకుడు రోశయ్య అని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కనిగండ్ల రామకోటేశ్వరరావు, రెడ్డి వెంకటరత్నం, చిలంకూరి కోటేశ్వరరావు, పువ్వాడ నాగేశ్వరరావు, గజవల్లి పవన్‌కుమార్, పొత్తూరి రాము, మేడం రమేష్, పీవీ సురేష్, జవ్వాజి పూర్ణ, రాజా, గంధం సుబ్బారావు పాల్గొన్నారు.

నూరుశాతం ఇంటింటి సర్వే చేయాలి

ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ఇంటింటి సర్వే పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా నివాస గృహాలు 13 వేల 802 ఉన్నాయని ఇప్పటి వరకు 12 వేల గృహాలు సర్వే చేశారని నూరుశాతం అయ్యేలా సచివాలయ సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. స్వర్ణా పంచాయతీ పోర్టల్ యాప్‌లో నివాస గృహాలు కొలతలు విస్తీర్ణం తదితరవన్నీ నమోదు చేయు బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సర్వే కార్యక్రమాలు నూరుశాతం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సర్వేకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. విధుల్లో ఆలసత్వం చూపిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈవోపీఆర్‌డి పి.సుగుణ ఉన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

చిలకలూరిపేట: మండలంలోని కావూరు గ్రామంలో నిర్మితమౌతున్న శ్రీషిరిడీ సాయిబాబా మందిరానికి చిన సత్తార్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పఠాన్ యూసుఫ్‌ఖాన్ రూ. లక్ష విరాళం అందజేశారు. బుధవారం ఆయన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో మందిర నిర్మాణ కమిటీ సభ్యులకు ఈ విరాళం అందించారు. తనకు మాతృ సమానురాలైన డీఆర్‌ఎన్‌ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ లైబ్రేరియన్ గింజుపల్లి సుశీలమ్మ జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మందిర నిర్మాణ కమిటీ సభ్యులతో పాటు రావిపాటి నాగరాజకుమారి, ఆరాధ్యుల రామకృష్ణ పాల్గొన్నారు.

నరసరావుపేటలో ర్యాలీ

నరసరావుపేట ఈస్ట్: బంగ్లాదేశ్‌లో హిందువులపై కొనసాగుతున్న మారణకాండను నిరసిస్తూ బుధవారం పట్టణంలో పల్నాడుజిల్లా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, కొత్త రాము, జొన్నలగడ్డ నాగరాజేశ్వరి, చేగు వెంకటేశ్వరరావు, కపలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ కలెక్టర్ వరదా సుబ్బారావుకు వినతి పత్రం సమర్పించారు.

ట్రైనింగ్ సెంటర్ మంజూరు చేయండి

నరసరావుపేట: జిల్లా కేంద్రంలో రోడ్డుసేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ సెంటర్‌కు అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాదరెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. బుధవారం సచివాలయంలో మంత్రిని కలిసి విన్నవించారు. తన నియోకవర్గంలో ఒక మహిళా పారిశ్రామికవేత్తచే 'రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ కోసం రవాణాశాఖలో బిజినెస్ అండ్ ఎస్టాబ్లిష్ మెంట్‌లో భాగంగా అనుమతి కోరకు అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. వెనుకబడిన జిల్లాలో పెట్టుబడి దారులకు అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఎలా ఈ పురుగుల అన్నం తినేది?

- కోటప్పకొండ డీడీయు-జీకేవై శిక్షణ కేంద్రంలో విద్యార్థుల ఆందోళన
- నాసిరకం ఆహారం అందించడంపై ఆగ్రహం
- రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని పీడీ హామీ



విద్యార్థులకు అందించిన అన్నంలో పురుగు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం(డీడీయు–జీకేవై)లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఆందోళన చేపట్టారు. శిక్షణ కేంద్రంలో అందించే భోజనంలో పురుగులు వస్తున్నాయని, అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఉన్నతాధికారులు తమకు హామీ ఇచ్చే వరకు భోజనం స్వీకరించమని బుధవారం ఆందోళనకు దిగారు.

డీడీయూ–జీకేవై శిక్షణ కేంద్రంలో 70 మంది యువతీ, యువకులు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ పొందుతున్నారు. గత రెండు నెలలుగా వీరికి అందించే భోజనం నాసిరకంగా ఉండటంతో పలుమార్లు విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారం రోజుల క్రితం రాతపూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారు. అయినా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోలేదు. మంగళవారం మధ్యాహ్నం అందించిన భోజనంలో పురుగులు దర్శనమిచ్చాయి. దీంతో విద్యార్థులు భోజనాన్ని స్వీకరించకుండా వెళ్లిపోయారు. బుధవారం ఉదయం కేంద్రంలో అందించే అల్పాహారం స్వీకరించకుండా నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజనం కూడా తీసుకోకుండా ఆందోళనకు దిగారు. నాణ్యమైన భోజనాన్ని అందిస్తామని అధికారులు హామీ ఇచ్చే వరకు భోజనాన్ని స్వీకరించమని స్పష్టం చేశారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా ఆహారాన్ని సరఫరా చేసే నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు వాపోయారు. పురుగులు అన్నం తినలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు.

రెండురోజుల్లో పరిష్కరిస్తాం

విద్యార్థుల ఆందోళనతో గుంటూరు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీ విజయలక్ష్మీ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. విద్యార్థులతో కలిసి పీడీ భోజనాన్ని స్వీకరించారు.

రామారావుకు ఘన నివాళి



రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: విద్యా, ఆధ్యాత్మిక రంగాలలో ఎనలేని కృషి చేసిన ధన్యజీవి నాగసరపు రామారావు అని పలువురు కొనియాడారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో బుధవారం కళాశాల మాజీ కార్యదర్శి నాగసరపు రామారావు 12వ వర్ధంతిని నిర్వహించారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ, తాను కళాశాల పూర్వ విద్యార్థినని, ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యాదానం చేసిన దేవాలయమని తెలిపారు. కళాశాల కార్యదర్శిగా, శ్రీపట్టాభిరామస్వామి ఆలయ ధర్మకర్తగా, కర్నూల సత్రం, చలివేంద్రం వంటి సేవా కేంద్రాలను సమర్థవంతంగా నడిపిన ధార్మిక వ్యక్తిగా రామారావు చిరస్మరణీయుడని కొనియాడారు. రామారావు సేవలను గుర్తించి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభాపురస్కారంతో గౌరవించిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, రామారావు మనుమలు రూపేష్‌గుప్త, రాందేవ్‌గుప్త, కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

డీఈఓ చంద్రకళ



ఎన్‌ఏఎస్ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో సామర్థ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. నరసరావుపేట పరిధిలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, చైతన్య భారతి స్కూల్, హార్ట్ పాఠశాల, రావిపాడులోని సెయింట్ మేరీస్ పాఠశాలల్లో నిర్వహిస్తున్న నేషనల్ అసెస్మెంట్ సర్వే పరీక్షల నిర్వహణ తీరును బుధవారం డీఈఓ చంద్రకళ పరిశీలించారు. ఆయా కేంద్రాలలో 3వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల వ్యవధిలో 45 ప్రశ్నలు, 6వతరగతి విద్యార్థులకు 90 నిమిషాల వ్యవధిలో 51 ప్రశ్నలు, 9వతరగతి విద్యార్థులకు 120 నిమిషాల వ్యవధిలో 60 ప్రశ్నలతో పరీక్ష నిర్వహించారు. ఆయా కేంద్రాలతో పాటు మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి 8వ తేదీన జరగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈసందర్భంగా డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, ఎన్ఎంఎస్ పరీక్ష ద్వారా విద్యార్థులలో సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ చేతిరాతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఓ.సాంబయ్య, బాలుర పాఠశాల హెచ్‌ఎం టి.రవికాంత్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేపై సమీక్ష

నరసరావుపేట రూరల్: గ్రామాల్లోని బడ్డీ షాపు నుంచి పెద్ద ఇండస్ట్రీస్ వరకు పరిశ్రమల సమగ్ర సర్వేలో సేకరించాలని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తెలిపారు. ఎంఎస్ఎంఈ సర్వే, మోడల్ టాయిలెట్స్, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, టాంక్స్ క్లీనింగ్ క్లోరినేషన్‌పై సచివాలయ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలోని మండలంలో ఐదు వేల యూనిట్స్‌ను ఎంఎస్ఎంఈ సర్వేలో చేయాలని లక్ష్యంగా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ప్రొమోషనల్ ఆఫీసర్ ఎం.సత్యప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో సమీక్ష జరిపారు. గ్రామాల్లో అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 పనిదినాలు కల్పించాలన్నారు. క్యాటిల్ షెడ్స్, ఫారం పాండ్స్‌ను పూర్తిచేయాలని తెలిపారు.

అగ్గితెగులు నివారణపై దృష్టిసారించాలి

నరసరావుపేట రూరల్: వరిలో అగ్గితెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని చింతలపాలెంలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమంలో డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబులు పాల్గొన్నారు. గ్రామం పరిధిలోని వరి పొలాలను అధికారులు పరిశీలించి అగ్గి తెగులు ఉన్నట్టు గుర్తించి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. వరి ఆకుల మీద, వెన్ను మెడ భాగాల మీద ఆకులపై దారపు కండే ఆకారంలో మచ్చలు తరచుగా కనిపించడం తెగులు లక్షణంగా తెలిపారు. వీఏఏ డి.హరివినయ్, రైతులు పాల్గొన్నారు. అలాగే అల్లూరివారిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కజొన్న పంటలను డాట్ శాస్త్రవేత్త ఎం.నగేష్, ఏడిఏ మస్తానమ్మలు పరిశీలించారు. రైతులు అవగాహన లేకుండా మొక్కజొన్న మొవ్వలలో నేలకు వాడే సాయిల్ బూస్టర్ గుళికలను వేయడం వలన మొవ్వలు మెలితిరిగిపోయి ఎదుగుదల నిలిచిపోతుందని తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి శ్రీకారం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో ఉన్ననటువంటి ఎంపీపీ మెయిన్ పాఠశాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాల ఆక్రమణలకు గురికాకుండా ఉండటానికి చుట్టు సిమెంటు పోల్స్‌తో ఫెన్సింగ్ పనులు చేశామన్నారు. పాఠశాలలో అవరణలో ఉన్న పిచ్చికంప ముళ్ళచెట్లు డోజర్ సహాయంతో తొలగించామన్నారు. అనంతరం చదును చేయించి బండపరుపు కూడా ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు దాతలు సహకారంతో త్వరలో పాఠశాల అవరణలో చిన్నారుల ఆడుకునే జారుడుబల్ల, ఊయల లాంటి తదితర ఆటలు ఆడుకునే విధంగా పనులు చేయిస్తామన్నారు.అంగన్‌వాడీ కేంద్రంలో కావల్సిన సదుపాయాలు కూడా చేశామన్నారు. బోయపాటి నవీన్ రూ.10 వేలు, సూరబత్తిని మల్లేశ్వరరావు, లింగారావు, నాదెండ్ల వెంకటరావు, వెల్లలచెరువు రాధ, యం.కోటేశ్వరరావు, వి.శంకరు తదితరులు దాతల సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాలలు అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

పోషకాలతో రుచికరమైన భోజనం అందించాలి

ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి

నాదెండ్ల: విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో పోషకాలతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తినే భోజనాన్ని తాను స్వయంగా ఉపాధ్యాయులతో కలిసి రుచి చూశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సోమవారం నుంచి శనివారం వరకూ నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. పాఠ్యాంశాల బోధనం, మధ్యాహ్న భోజన మెనూ అమలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు కె.రెడ్డియ్యచౌదరి, శ్రీనివాసరావు, పాల్‌రాజు ఉన్నారు.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజా వ్యతిరేక విధానాలు

చిలకలూరిపేట: కేంద్రరాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9,10 తేదీలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నాయకులను కోరారు. దీంతో పాటు పదో తేదీన డిమాండ్స్ డే ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు: మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ చిలకలూరిపేట డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని వంకాయలపాడు, కారుచోల ఫీడర్ మరమ్మతుల కారణంగా వంకాయలపాడు, సంగంగోపాలాపురం, ఉప్పరపాలెం గ్రామాలకు గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ విభాగాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

పంటల బీమాపై అవగాహన

రొంపిచర్ల: మండలంలోని మునుమాక, ముత్తనపల్లి గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న, కంది పంటలో రైతులు అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులు సాగుచేస్తున్న వరి, మొక్కజొన్న, కంది పంటలను వ్యవసాయ శాఖ అధికారుల బృందం పరిశీలించింది. ప్రస్తుత వాతావరణానికి వరిపంటకు మానుకాయ వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు టిల్ట్, సాఫ్ మందులను పిచికారీ చేసి నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ డీడీఏ శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, వ్యవసాయ అధికారి శివలలిత, ఆయా గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

అక్రమ వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

ఆర్డీవోను కోరిన బాధితులు, ప్రజాసంఘాల నాయకులు



నరసరావుపేట: బాధితులపై బెదిరింపులకు పాల్పడుతున్న అక్రమ వడ్డీ వ్యాపారులైన నాయుడు బాబు, శ్రీనివాసరావు, విజయ కళ్యాణిలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బాధితులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి కార్యాలయ సూపరిండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు మాట్లాడుతూ అక్రమ వడ్డీ వ్యాపారం పేరుతో పైన పేర్కొన్న వ్యక్తులు ప్రజల ఆస్తులు దోచుకుంటున్నారని, వారి ఆగడాలపై బాధితులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సదరు వ్యక్తులు బాధితులపై అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. దీన్ని ప్రజాసంఘాలుగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే వారి పై చర్యలు తీసుకోవాలనికోరారు. బీసీ సంఘం నాయకులు శ్రీనివాసరావు, బాధితులు బి.పద్మ, బి కన్నా, వై. అనసూర్య, వై మహేష్ ,పిడిఎం జిల్లా కార్యదర్శి జి రామకృష్ణ, షేక్ మస్తాన్‌వలి, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

యడ్లపాడు: రెవెన్యూ గ్రామసభలు ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. యడ్లపాడు మండలంలోని 13 రెవెన్యూ గ్రామాలలో ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఏర్పాటు చేసినట్లు షెడ్యూల్ విడదల చేశారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: ఈ నెల 6 నుంచి 31వ తేదీ వరకూ గ్రామ రెవెన్యూ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. భూములకు సంబంధించిన మ్యుటేషన్లు, ఎల్‌ఈసీ కార్డుల మంజూరు, భూవివాదాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, సెక్షన్ 222ఎ తారుమారు వంటి అంశాలపై సంబంధిత రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

శావల్యాపురం: రెవెన్యూ గ్రామసభలు ఈనెల 6 నుంచి 31 వరకు నిర్వహిస్తామని తహసీల్దారు కె.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపరమైన సమస్యలు పరిష్కారానికి ఈ గ్రామసభలు ఏంతోగానో దోహదపడతాయన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

నరసరావుపేట ఈస్ట్: సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకొని ప్రకాష్‌నగర్ టౌన్‌హాల్‌లోని ఆయన విగ్రహం వద్ద బుధవారం కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. వివిధ కళాసంస్థల ప్రతినిధులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, డి.వి.చంద్రశేఖరరావు, ఓగూరి నాగేశ్వరరావు, చేగు వెంకటేశ్వరరావు, స్వర్ణ చినరామిరెడ్డి తదితరులు పాల్గొని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఆలపించిన మధుర సినీ గీతాలను గుర్తు చేసుకున్నారు.

వ్యాధి నిర్ధారణ పారదర్శకంగా చేయాలి



టెక్నీషియన్‌తో మాట్లాడుతున్న డాక్టరు భవాని

శావల్యాపురం: క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య పరీక్షలు పారదర్శకంగా చేయాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజషన్ ఐదు జిల్లాల రీజనల్ టీబీ విభాగానికి సంబంధించిన వైద్యాధికారి డాక్టరు భవాని అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భవాని మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, కళ్లె రావటం, జ్వరంతో కూడిన ఆకలి మందగించటం తదితర లక్షణాలు ఉంటే సత్వరమే క్షయ పరీక్షలు చేయించుకుని మందులు సకాలంలో వాడితే క్షయ వ్యాధి నయం అవుతుందన్నారు. ఆరోగ్య కేంద్రంలో టీబీ కళ్లె పరీక్షలు చేయు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు చికిత్స చేయు విధానం రికార్డు నిర్వహణ తదితరవన్నీ పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్షయ వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్యసేవలు, ల్యాబ్‌లో అందుతున్న వైద్య పరీక్షలు సమగ్ర వివరాలు అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సులు బాలిబోయిన లక్ష్మిప్రసన్న, ధనలక్ష్మి, ప్రమీల, ల్యాబ్ టెక్నీషియన్లు సీతారామిరెడ్డి, సతీష్‌లు ఉన్నారు.

ప్రేమతత్వమే క్రీస్తు చూపిన మార్గం

- పాస్టర్స్ ఫెలోషిప్ పల్నాడు జిల్లా అధ్యక్షులు నందమూరి క్రిష్టర్
- మండల పాస్టర్ల ఆధ్వర్యంలో సెమిక్రిస్మస్ వేడుకలు



తిమ్మాపురంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న ప్లాస్టర్లు

యడ్లపాడు: సర్వమానవాళికి ప్రేమతత్వం బోధించేందుకు యేసుక్రీస్తు ఈలోకానికి మానవ రూపంలో వచ్చినట్లు పాస్టర్స్ ఫెలోషిప్ పల్నాడు జిల్లా అధ్యక్షులు నందమూరి క్రిష్టర్ ఉపదేశించారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల గుడ్‌షెఫర్డ్ యునైటెడ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్థానిక యోహోవా యీరే ప్రార్థన మందిరంలో నిర్వహించిన ఈ వేడుకలకు నందమూరి క్రిష్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీస్తు స్తుతిగీతాలను ఆలపించి, బైబిల్ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంతోనే మానవాళికి శాంతి సమాధానం లభిస్తుందన్నారు. కేక్ కట్ చేసి అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుంటూరుకు చెందిన బూసి ప్రసాదరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షులు ప్రత్తిపాటి ఎలీషా, కార్యదర్శి కొమ్ము ఇమ్మానీయేల్, ప్రత్తిపాటి యోహాన్, కోశాధికారి అల్లడి కరుణానిధి, జీవన్‌పాల్, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పాస్టర్లు, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

రోశయ్య పేరిట స్మృతి వనం ఏర్పాటు చేయాలి

- గత ప్రభుత్వంలో జీవో జారీ
- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రివర్యులు కొణిజేటి రోశయ్య పేరిట స్మృతి వనం ఏర్పాటు చేయాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మూడో వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం స్థానిక శివునిబొమ్మ సెంటర్‌లోని రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వేమూరు గ్రామంలో జన్మించి రోశయ్య కింద స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన మహానేత అని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 16 బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఏకైక వ్యక్తని, దేశంలో ఈ ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన కుటుంబాన్ని సైతం రాజకీయాలకు దూరంగా ఉంచి, చిత్తశుద్ధితో రాజకీయాలు నిర్వహించి రాజకీయ జీవితంలో చిన్నమచ్చ కూడా లేకుండా తనకంటూ ఒక చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రోశయ్య పేరిట స్మృతి వనం ఏర్పాటుచేయాలని వెల్లంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశామని, ల్యాండ్ సేకరణ కోసం అప్పట్లో జీవో జారీ చేయడం జరిగిందన్నారు. దానిని ఈ ప్రభుత్వం ఆచరణలో పెట్టాలని కోరారు. ఆర్యవైశ్య నాయకులు కొత్తమాసు మల్లారావు, బత్తుల విష్ణు, మాజీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొత్తూరు కిషోర్, భవిరిశెట్టి నాగేశ్వరరావు, అన్నేమోహన్, శరత్‌బాబు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

• ఎదుగుదల లేక..



మండలంలో బుధవారం ఓ మోస్తరు పొడి వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అప్పుడప్పుడు తెరలు తెరలుగా ఎండలు కాసాయి. ఆకాశంలో ఏర్పడుతున్న మబ్బులు చూసి వర్షం ఆగిపోలేదని, తిరిగి వర్షం కురుస్తుందని రైతులు ఆందోళనగానే ఉన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పుల్లశనగ పైరు ఎదుగుదల పూర్తిగా నిలిచిపోయిందని రైతులు తెలుపుతున్నారు. పది రోజుల క్రితం విత్తిన పుల్లశనగ విత్తనాలు వర్షానికి మురిగి పోయాయని రైతులు తెలుపుతున్నారు. ఇంతటితో వర్షాలు ఆగితే తిరిగి పుల్లశనగ పైరును దున్ని ఏదో ఒక పైరు విత్తుకోవాలన్నా ఆలోచనలో రైతులు ఉన్నారు.

– రొంపిచర్ల